रजिस्ट्री सं डी--२२१
Registered No. D-221
రిజిస్ట్రీ సంఖ్య డి--221

हिंदी II अनुभाग
राजभाषा खण्ड
डा. सं..........
तारीख........

मूल्य रु 5.00 पैसे
[Price Rs. 5.00 Paise.
మూల్యము : రూ. 5.00 పైసలు

भारत का राजपत्र
The Gazette of India
భారత రాజపత్రము

असाधारण
EXTRAORDINARY
అసాధారణ

भाग XVI अनुभाग 1
Part XVI Section 1
భాగము XVI అనుభాగము 1

प्राधिकार से प्रकाशित
PUBLISHED BY AUTHORITY
ప్రాధికారము ద్వారా ప్రచురింపబడినది

| | | | | |
|---|---|---|---|---|
| सं १ | नई दिल्ली | सोमवार | ९ जून २००८/२० वैशाखा | खण्ड १५ |
| No. 1 | New Delhi | Monday | 9 June, 2008/20 Vaishakha | Vol. 15 |
| సంఖ్య 1 | న్యూఢిల్లీ | సోమవారము | 9 జూన్, 2008/20 వైశాఖ | సంపుటము15 |

## MINISTRY OF LAW AND JUSTICE
## (LEGISLATIVE DEPARTMENT)

New Delhi, 10th March, 2008/18 Maga, 1930 Servadari

The Translations in Telugu of the following Acts namely:-

(1) The Working Journalists and Other Newspaper Employees (Conditions of Service) and Miscellaneous Provisions Act, 1955 (Act No. 45 of 1955); (2) The University Grants Commission Act, 1956 (Act No. 3 of 1956); (3) The Medicinal and Toilet Preparations (Exercise Duties) Act, 1955 (Act No. 16 of 1955); (4) The Prevention of Cruelty to Animals Act, 1960 (Act No. 59 of 1960) and (5) The National Commission for Women Act, 1990 (Act No. 20 of 1990) are hereby published under the authority of the President and shall be deemed to be the Authoritative Texts thereof in Telugu under Clause (a) of Section 2 of the Authoritative Texts (Central Laws) Act, 1973 (Act 50 of 1973).

# శాసన మరియు న్యాయపాలన మంత్రిత్వ శాఖ
## (శాసన నిర్మాణ విభాగము)

ఈ క్రింది చట్టములు, అనగా:-

(1) వర్కింగు జర్నలిస్టుల మరియు ఇతర వార్తాపత్రిక ఉద్యోగుల (సేవా షరతులు) మరియు వివిధ నిబంధనల చట్టము, 1955 (1955 లోని 45వ చట్టము); (2) విశ్వవిద్యాలయ గ్రాంట్ల కమీషను చట్టము, 1956 (1956 లోని 3వ చట్టము); (3) ఔషధీయ మరియు ప్రసాధన ద్రవ్యముల తయారీ (ఎక్సైజు సుంకముల) చట్టము, 1955 (1955 లోని 16వ చట్టము); (4) జంతువులపట్ల క్రూరత్వ నివారణ చట్టము, 1960 (1960 లోని 59వ చట్టము) మరియు (5) జాతీయ మహిళా కమీషను చట్టము, 1990 (1990 లోని 20వ చట్టము)ల యొక్క తెలుగు అనువాదములను రాష్ట్రపతి ప్రాధికారము క్రింద ఇందుమూలముగా ప్రచురించడమైనది. ఆ చట్టములకు గల ఈ అనువాదములను ప్రాధికృత పాఠముల (కేంద్ర శాసనముల) చట్టము, 1973 (1973 లోని 50వ చట్టము) యొక్క 2వ పరిచ్ఛేదములోని ఖండము (ఏ) క్రింద, ప్రాధికృత తెలుగు పాఠములైనట్లు భావించవలెను.

# ఔషధీయ మరియు ప్రసాధన ద్రవ్యముల తయారీ (ఎక్సైజు సుంకముల) చట్టము, 1955

(1955 లోని 16వ చట్టము)

(27 ఏప్రియల్ 1955)

అల్కహోలు, మాదక ఓషధి లేక మాదక పదార్థము కలిగిన ఔషధీయ మరియు ప్రసాధన ద్రవ్యముల తయారీపై ఎక్సైజు సుంకము విధించి వసూలు చేయుట కొరకు నిబంధనలు చేయుటకైన చట్టము.

భారత గణరాజ్యము యొక్క ఆరవ సంవత్సరములో పార్లమెంటుచే ఈ క్రింది విధముగా శాసనము చేయడమైనది:-

## ప్రారంభిక

1\. (1) ఈ చట్టమును ఔషధీయ మరియు ప్రసాధన ద్రవ్యముల తయారీ (ఎక్సైజు సుంకముల) చట్టము, 1955 అని పేర్కొనవచ్చును. సంగ్రహనామము, విస్తరణ మరియు ప్రారంభము.

(2) ఇది యావద్భారత దేశమునకు విస్తరించును.

(3) ఇది కేంద్ర ప్రభుత్వము రాజపత్రములో అధిసూచన ద్వారా నియతము చేయునట్టి *తేదీన అమలులోనికి వచ్చును.

2\. ఈ చట్టములో సందర్భమునుబట్టి అర్థము వేరుగా ఉన్ననే తప్ప- నిర్వచనములు.

(ఎ) "అల్కహోలు" అనగా సీ$_2$ హెచ్$_5$ ఓహెచ్ రసాయనిక సమ్మిశ్రమును కలిగిన ఎంత శక్తివంతమైనదైనను ఎంత స్వచ్ఛమైనదైనను ఈథైల్ అల్కహోలు అని అర్థము;

(ఎఎ) "కోకా వ్యుత్పన్నము" అనగా--

(i) ముడి కోకేన్, అనగా కోకేన్ తయారుచేయుటకు ప్రత్యక్షముగాగాని, పరోక్షముగాగాని ఉపయోగపడు కోకా ఆకు నుండి తీసినది;

(ii) ఎక్గోనిన్, అనగా సీ$_2$ హెచ్$_{15}$ ఎన్ఓ$_3$ హెచ్$_2$ఓ రసాయనిక సూత్రము కలిగి, లేవో-ఎక్గోన్నిన్ మరియు లేవో-ఎక్గోనిన్ నుండి పొందబడు అన్ని వ్యుత్పన్నములు; మరియు

(iii) కోకేన్, అనగా - సీ$_{17}$ హెచ్$_{21}$ ఎన్ఓ$_4$ రసాయనిక సూత్రము కలిగి మీథైల్-బెంజాయిల్-లేవో-ఎక్గోనిన్ మరియు దాని లవణములు;

(ఎబి) "కోకా ఆకు" అనగా--

(i) ఏదేని కోకా మొక్క యొక్కఆకు మరియు చిన్న రెమ్మలు అనగా ఎరిత్రోక్సైలాన్ కోకా (లమ్క్) మరియు ఎరిత్రోక్సైలాన్ నివో-గ్రాటెన్స్ (హియరన్) మరియు వాటి రకములు మరియు ఈ చట్ట ప్రయోజనములకై కేంద్ర ప్రభుత్వము రాజపత్రములో అధిసూచన ద్వారా కోకా మొక్కలని ప్రఖ్యానించునటువంటి ఆ జాతి ఇతర రకములు; మరియు

---

*1.4.1957 (ఎస్.ఆర్.ఓ. 892, తేదీ 9.3.1957 ప్రకారం).

(ii) నిష్ప్రభావమైన పదార్థములతోగాని లేకుండ గాని దాని ఏదేని మిశ్రమము;

అని అర్థము.

(బి) "వసూలు చేయు ప్రభుత్వము" అనగా ఈ చట్టము క్రింద విధింపబడిన సుంకములను వసూలు చేయుటకు హక్కుగల కేంద్ర ప్రభుత్వము లేక సందర్భానుసారముగ రాజ్య ప్రభుత్వము అని అర్థము.

(బిబి) "నల్లమందు నుండి వ్యుత్పన్నమైనది" అనగా--

(i) ఔషధీయ నల్లమందు, అనగా, ఔషధముగా వాడుకొనగలుగునట్లు చేయుటకై అనుకూల్యపరచుటకు అవసరమైన ప్రక్రియలకు గురిచేయబడిన నల్లమందు;

(ii) తయారుచేయబడిన నల్లమందు, అనగా, నల్లమందును పొగ త్రాగుటకు వీలుగా పరివర్తనము చేయుటకై ఏవేని వివిధ ప్రక్రియల ద్వారా పొందిన నల్లమందు యొక్క ఏదేని పదార్థము మరియు నల్లమందు పొగత్రాగిన తరువాత మిగిలిన ఏదేని పొడి లేక ఇతర అవశేషములు;

(iii) మార్ఫిన్, అనగా, సీ17 హెచ్19 ఎన్ఓ3 రసాయనిక సూత్రము గల నల్లమందు యొక్క ముఖ్య అల్కలోయిడ్ మరియు దాని లవణములు, వ్యుత్పన్నములు;

(సి) "సుంకము చెల్లించదగు సరుకులు" అనగా ఈ చట్టము క్రింద విధించబడిన ఎక్సైజు సుంకములకు లోనగునవిగా అనుసూచిలో నిర్దిష్టపరచిన ఔషధీయ మరియు ప్రసాధన ద్రవ్యముల తయారీలు అని అర్థము;

(డి) "ఎక్సైజు అధికారి" అనగా ఏదేని రాజ్యము యొక్క ఎక్సైజు విభాగము అధికారి అని అర్థము మరియు ఈ పదపరిధిలో ఈ చట్టము క్రింద ఎక్సైజు అధికారి యొక్క అన్ని లేక ఏవేని అధికారములను వినియోగించుటకు వసూలు చేయు ప్రభుత్వముచే అధికారమొసగబడిన ఎవరేని వ్యక్తి చేరియుండును;

(ఈ) "భారతీయ హెంప్" అనగా,-

(i) భంగు, సిద్ధి లేక గంజాయి అనబడు అన్ని రకములతోసహా భారతీయ హెంప్ (కెనోబిస్ సతివా ఎల్) యొక్క ఆకులు, చిన్న రెమ్మలు మరియు పుష్పించు, ఫలించు చివరి కొనలు;

(ii) చరస్, అనగా, ప్యాక్ మరియు రవాణా చేయుటకు అవసరమగు ప్రక్రియలు మినహా ఏవైన ప్రక్రియలకు గురిచేయబడునట్టి భారతీయ హెంప్ యొక్క నుండి పొందిన జిగురు;

(iii) నిష్ప్రభావమైన పదార్థములతో గాని లేకుండ గాని భారతీయ హెంప్ యొక్క పైన తెలిపిన ఏవేని రకములలో ఏదైన మిశ్రమము లేక దాని నుండి తయారుచేయబడిన ఏదేని పానీయము; మరియు

(iv) భారతీయ హెంప్ యొక్క పైన తెలిపిన ఏవేని రకములతో తీసినది ఏదైనను లేక టింక్చరు;

అని అర్థము.

(ఎఫ్) "వినిర్మాణము" అను పదపరిధిలో ఏదేని సుంకము చెల్లించదగు సరుకుల వినిర్మాణమును పూర్తిచేయుటకు అనుషంగికమైన లేక సహాయకమైన ఏదేని ప్రక్రియ చేరియుండును;

(జి) "ఔషధీయ తయారీ" అను పదపరిధిలో మనుషుల లేక జంతువుల అంత: సేవనముకై లేక బాహ్య ప్రయోగముకై తయారుచేయబడిన ఉపచారము లేక నిర్ణీతమైనట్టి అన్ని ఓషధులు మరియు మనుషుల లేక జంతువుల రోగము యొక్క చికిత్స, తగ్గుదల లేక నివారణకై ఉపయోగించుటకు ఉద్దేశించబడిన అన్ని పదార్థములు చేరియుండును;

(హెచ్) "మాదక ఔషధి లేక మాదక పదార్థము" అనగా కోకా ఆకు లేక కోకా వ్యుత్పన్నము లేక నల్లమందు లేక నల్లమందు నుండి వ్యుత్పన్నమైనది లేక భారతీయ హెంప్ అనబడు పదార్థము అని అర్థము మరియు ఈ పదపరిధిలో మనుషులలో అధీనత, సహనము మరియు ఉపసంహరణ లక్షణములను కలిగించగల లేక ఉత్పన్నము చేయగల మాదక ఔషధి లేక మాదక పదార్థము అని కేంద్ర ప్రభుత్వము రాజపత్రములో అధిసూచన ద్వారా ప్రఖ్యానించునట్టి ఏదేని ఇతర పదార్థము అని అర్థము.

(ఐ) "నల్లమందు" అనగా,---

(1) సహజ రూపములో నున్నదైనను కాకున్నను కోయబడినదైనను, చితకకొట్టబడినదైనను లేక పిండి చేయబడినదైనను మరియు వాటి నుండి రసము తీయబడినదైనను, కాకున్నను గసగసాల (పెపెవరు సోమ్నీ ఫెరమ్ ఎల్) యొక్క *కాప్సూల్.

(2) ప్యాక్ మరియు రవాణా చేయుటకు అవసరమగు ప్రక్రియలు మినహా ఏవేని ప్రక్రియలకు గురిచేయబడని అట్టి *కాప్సూలులో స్వత: ఘనీభవించిన రసము మరియు

(3) నిష్క్రియభావమైన పదార్థములతో గాని లేకుండ గాని నల్లమందు యొక్క పైన తెలిపిన ఏవేని రూపములలో ఏదేని మిశ్రమము

అని అర్థము; మరియు ఈ పదపరిధిలో నల్లమందు నుండి వ్యుత్పన్నమైన ఏ పదార్థమైనను చేరియుండును.

(జె) "విహిత" అనగా ఈ చట్టము క్రింద చేయబడిన నియమముల ద్వారా విహితపరచిన అని అర్థము;

(కె) "ప్రసాధన ద్రవ్యముల తయారీ" అనగా మానవ శరీర ప్రసాధనముకై లేక ఎటువంటి దుస్తులనైనను పరిమళభరితమగునట్లు చేయుటకై ఉద్దేశింపబడిన ఏదైన తయారీ లేక ముఖవర్చస్సును, చర్మమును, కేశములను లేక దంతములను శుభ్రపరచుటకు, మెరుగుపరచుటకు లేక మార్పుచేయుటకు ఉద్దేశింపబడిన ఏదేని పదార్థము అని అర్థము, మరియు ఈ పదపరిధిలో దుర్గంధహరములు మరియు పరిమళ ద్రవ్యములు చేరియుండును.

## సుంకములు విధింపు మరియు వసూలు

కొన్ని సరుకులకై ఎక్సైజు సుంకములను విధించి వసూలు చేయుట.

3. (1) భారతదేశములో వినిర్మితమై సుంకము చెల్లించదగు సరుకులన్నింటిపై, అనుసూచిలో నిర్దిష్టపరచబడిన రేటు చొప్పున ఎక్సైజు సుంకములను విధించవలెను.

(2) పైన చెప్పబడిన సుంకములు---

*కాప్సూల్ = మందుగొట్టాలు.

(ఎ) సుంకము చెల్లించదగు సరుకులు బాండు ద్వారా వినిర్మాణము చేయబడినయెడల, అట్టి సరుకులు ఏ రాజ్యములో స్వదేశీయ వినియోగము కొరకు బాండు గిడ్డంగి నుండి విడుదల చేయబడునో, అట్టి రాజ్యములోనే, ఆ సరుకులు వినిర్మాణము చేయబడినను కాకున్నను, ఆ రాజ్యములోను;

(బి) సుంకము చెల్లించదగు సరుకులు బాండు ద్వారా వినిర్మాణము చేయబడనియెడల, అట్టి సరుకులు ఏ రాజ్యములో వినిర్మాణము చేయబడినవో ఆ రాజ్యములోను

విధించబడదగియుండవలెను.

(3) ఈ చట్టములోని ఇతర నిబంధనలకు లోబడి, పైన చెప్పబడిన సుంకములు విహితరీతిలో వసూలు చేయబడవలెను.

విశదీకరణ:- సుంకము చెల్లించదగు సరుకుల వినిర్మాణములో ఒక మిశ్రభాగముగా ఉపయోగించవలసిన ఆల్కహాలు, మాదక ఓషధి లేక మాదక పదార్థమునకు సంబంధించి, తత్సమయమున అమలునందున్న శాసనము క్రింద విధించదగు ఎక్సైజు సుంకమును చెల్లించకుండ అట్టి సుంకము చెల్లించదగు సరుకులను వినిర్మాణము చేయుటకు అనుమతించినచో అవి ఈ పరిచ్ఛేదపు భావములో బాండు ద్వారా వినిర్మాణము చేయబడినట్లు చెప్పబడును.

సుంకము చెల్లించదగు సరుకుల వినిర్మాణమునకై సరఫరా చేయబడిన ఆల్కహాల్ మొదలగు వాటిపై సుంకము, రిబేటు.

4. ఏదైన సుంకము చెల్లించదగు సరుకులను మిశ్రభాగముగా ఉపయోగించుటకు ఆల్కహాలు, మాదక ఓషధి లేక మాదక పదార్థము ఆ సరుకుల వినిర్మాతకు వసూలు చేయు ప్రభుత్వము ద్వారా లేక ఆ ప్రభుత్వము ప్రాధికారము క్రింద సరఫరా చేసినయెడల, మరియు అట్లు సరఫరా చేయబడిన సరుకులపై అట్టి ప్రభుత్వము తత్సమయమున అమలునందున్న ఏదేని శాసనము క్రింద అదివరకే ఎక్సైజు సుంకమును వసూలు చేసియుండినయెడల ఈ విషయమున తమకు దరఖాస్తు పెట్టుకొనిన మీదట వసూలుచేయు ప్రభుత్వము ఈ చట్టము క్రింద విధించదగు ఎక్సైజు సుంకము విషయములో ఈ చట్టము క్రింద విధించదగు సుంకమునకు మించి ఏదేని ఉన్నచో అట్టి ఏదైన సుంకము వసూలు చేయబడినయెడల, అట్లు మించియుండు సుంకము విషయమున అట్టి వినిర్మాతకు రిబేటు ఈయవలెను.

ప్రభుత్వమునకు రావలసిన సొమ్ముయొక్క వసూలు.

5. ఈ చట్టము యొక్క లేక ఈ చట్టము క్రింద చేయబడిన నియమముల యొక్క ఏవేని నిబంధనల క్రింద వసూలుచేయు ప్రభుత్వమునకు చెల్లించదగు ఎక్సైజు సుంకము మరియు ఏ రకపువైనను ఇతర సొమ్మును గూర్చి, అట్టి సుంకమును విధించుటకు లేక అట్టి సొమ్ము చెల్లించవలెనని కోరుటకు సదరు నియమముల ద్వారా అధికారమొసగబడిన ఎక్సైజు అధికారి ఏ వ్యక్తి నుండి అట్టి మొత్తములు వసూలు చేయబడవలసియుండునో లేక రావలసియుండునో అట్టి వ్యక్తికి ఈయవలసినదైయుండి, తన వద్ద లేక తన వశమునందు లేక తన నియంత్రణలోనున్న ఏదైన డబ్బు నుండి అట్లు చెల్లించదగు మొత్తమును పట్టుకొనవచ్చును లేక అట్టి వ్యక్తికి చెందిన సుంకము చెల్లించదగు సరుకులను జప్తుచేసి విక్రయించుట ద్వారా ఆ మొత్తమును వసూలు చేయవచ్చును మరియు అట్లు చెల్లించవలసిన మొత్తము అట్లు వసూలు చేయబడనిచో, అతడు, ఆ సొమ్ము చెల్లించవలసిన వ్యక్తి నుండి రావలసిన మొత్తమును నిర్దిష్టపరచుచు తన సంతకముతో ఒక ధ్రువపత్రమును తయారుచేసి, దానిని అట్టి వ్యక్తి నివసించుచున్న లేక వర్తకము జరుపుచున్న జిల్లా కలెక్టరుకు పంపవలెను. మరియు అట్టి ధ్రువపత్రము అందిన మీదట సదరు కలెక్టరు అందులో నిర్దిష్టపరచిన మొత్తమును, అది భూమిశిస్తు బకాయి అయియుండిన ఎట్లో అట్లే అట్టి వ్యక్తి నుండి వసూలు చేయుటకు పూనుకొనవలెను.

**కొన్ని ప్రక్రియలు లైసెన్సులకు లోబడియుండుట.**

6. (1) కేంద్ర ప్రభుత్వము, రాజపత్రములో అధిసూచన ద్వారా, అట్టి అధిసూచనలో నిర్దిష్టపరచిన తేదీ నుండి ఏ వ్యక్తిగాని ఈ చట్టము ననుసరించి ఈయబడిన లైసెన్సు ప్రాధికారము క్రింద మరియు ఆ లైసెన్సు నిబంధనల మరియు షరతుల ననుసరించి తప్ప, సుంకము చెల్లించవలసిన ఏవైన సరకులను లేక అట్టి సరుకుల యొక్క ఏవేని నిర్దిష్ట సంఘటకములను లేక మిశ్రభాగములను లేక అట్టి సరుకుల యొక్క నిర్దిష్ట ఆధార పాత్రలను లేక అట్టి ఆధార పాత్రల లేబుళ్లను ఉత్పత్తి లేక వినిర్మాణము చేయరాదని నిబంధించవచ్చును.

(2) ఉపపరిచ్ఛేదము (1) క్రింద ప్రతియొక లైసెన్సు విహితపరచబడు నట్టి ప్రాంతము, ఏదేని ఉన్నచో, ఆ ప్రాంతముకొరకై, అట్టి కాలావధికొరకు, అట్టి నిర్బంధనలు మరియు షరతులకు లోబడి మరియు అట్టి ప్రరూపములో అట్టి వివరములతో ఈయబడవలెను.

**అపరాధములు మరియు శాస్తులు.**

7. ఎవరేని వ్యక్తి,—

(ఎ) 6వ పరిచ్ఛేదము క్రింద జారీచేయబడిన అధిసూచన యొక్క ఏ నిబంధనలనైనను ఉల్లంఘించినచో; లేక

(బి) ఈ చట్టము క్రింద చెల్లింపదగు ఏదేని ఎక్సైజు సుంకమును చెల్లించుట నుండి తప్పించుకొనినచో; లేక

(సి) ఈ చట్టము క్రింద చేయబడిన నియమముల ద్వారా తాను అంద జేయవలసిన ఏదేని సమాచారమును అందజేయకుండినచో లేక (తాను అందజేసిన సమాచారము యదార్థమైనదేనని యుక్తమైన విశ్వాసమువున్ననే తప్ప,- రుజువు పరచు భారము అతనిపై ఉండును) తప్పుడు సమాచారము అందజేసినచో; లేక

(డి) ఖండము (ఎ) లేక ఖండము (బి)లో పేర్కొనిన ఏదేని అపరాధమును చేయుటకు ప్రయత్నించుచో లేక అట్టి అపరాధమును చేయుటకు దుష్ప్రేరణ చేయుచో

అతడు అట్టి ప్రతియొక అపరాధమునకు ఆరు మాసములదాక ఉండగల కారావాసముతోగాని రెండు వేల రూపాయలదాకా ఉండగల జుర్మానాతోగాని లేక రెండింటితోగాని శిక్షింపబడదగియుండును.

**సమపహరణకై ఆదేశించుటకు న్యాయస్థానముల అధికారము.**

8. 7వ పరిచ్ఛేదము క్రింద ఏదేని అపరాధమును విచారణచేయు ఏదేని న్యాయస్థానము సుంకము చెల్లించదగు ఏవేని సరుకుల విషయములో, ఈ చట్టము క్రింద అపరాధము చేయబడినదని తృప్తిచెందినచో, ఆ సరుకులు వసూలుచేయు ప్రభుత్వమునకు సమపహరణ కావలెనని ఆదేశించవచ్చును, మరియు వేటి ద్వారా అపరాధము చేయబడినదో అట్టి ఏదేని ఆల్కహాలు, ఓషధులు లేక సామగ్రి మరియు ఏవేని అట్టి సరుకులు లేక వస్తువులు ఉంచబడినట్టి ఏవేని పేటికలు, బంగీలు లేక కవరింగులు మరియు అట్టి ఏవైన సరుకులను లేక వస్తువులను కొనిపోవుటకు ఉపయోగించబడిన జంతువులు, వాహనములు, జలయానములు లేక ఇతర ప్రయాణ సాధనములు మరియు అట్టి సరుకుల వినిర్మాణములో ఉపయోగించబడిన ఏవేని ఇతర పరికరములు లేక యంత్రములు కూడ సమపహరణ కావలెనని ఆదేశించవచ్చును.

## అధికారుల యొక్కయు భూమిధారుల యొక్కయు అధికారములు, మరియు కర్తవ్యములు

అరెస్టుచేయు అధికారము.

9. (1) ఈ విషయమున చేయబడిన నియమముల ద్వారా తగురీతిగా అధికారము పొందిన ఏ ఎక్సైజు అధికారియైనను, ఈ చట్టము క్రింద శిక్షకు పాత్రుడని తాను విశ్వసించుటకు కారణమున్నట్టి ఏ వ్యక్తినైనను అరెస్టు చేయ వచ్చును.

(2) ఈ చట్టము క్రిందగాని ఈ చట్టము క్రింద చేయబడిన ఏవైన నియమముల క్రింద గాని అపరాధము మోపబడి, లేక యుక్తముగా అనుమానించ బడి ఈ చట్టము క్రింద చేయబడిన నియమముల ద్వారా తగురీతిగా అధికారము పొందిన ఎవరేని ఎక్సైజు అధికారిచే అడుగబడినపుడు తన పేరును, నివాసమును తెలుపుటకు నిరాకరించు లేక నిజముకాదని అట్టి అధికారి విశ్వసించుటకు కారణ ముండునట్టి పేరు లేక నివాసమును తెలుపు ఏ వ్యక్తియైనను అతని పేరు మరియు నివాసమును తెలుసుకొనుటకుగాను అట్టి అధికారిచే అరెస్టు చేయబడవచ్చును.

ఈ చట్టము క్రింద పరిశీలనలో సాక్ష్యము నిచ్చుటకు మరియు దస్తావేజులను దాఖలు చేయుటకు వ్యక్తులను సమనుచేయు అధికారము.

10. (1) ఈ విషయమున చేయబడిన నియమముల ద్వారా తగురీతిగా అధికారము పొందిన ఏ ఎక్సైజు అధికారియైనను తాను ఈ చట్టము యొక్క ఏదేని ప్రయోజనముకొరకై చేయుచున్నట్టి ఏదైన పరిశీలనలో సాక్ష్యమునిచ్చుటకు లేక ఏదైన దస్తావేజును లేక ఇతర వస్తువును దాఖలుచేయుటకు హాజరగుట ఆవశ్యకమని తాను భావించునట్టి ఏ వ్యక్తియైనను సమనుచేయుటకు అధికారము కలిగియుండ వలెను.

(2) ఉపపరిచ్ఛేదము (1) క్రింద దస్తావేజులను లేక ఇతర వస్తువులను దాఖలు చేయుటకైన సమనులు, సంబంధిత వ్యక్తి స్వాధీనములో లేక నియంత్రణ క్రింద ఉన్న కొన్ని నిర్దిష్ట దస్తావేజులను లేక వస్తువులను దాఖలు చేయుటకైనను కావచ్చును. లేక ఒకానొక వర్ణనకుచెందిన అన్ని దస్తావేజులను లేక వస్తువులను దాఖలు చేయుటకైనను కావచ్చును.

(3) అట్లు సమను చేయబడిన వ్యక్తులందరు అట్టి అధికారి ఆదేశించు నట్లు స్వయముగాగాని ప్రాధికృత ఏజెంటు ద్వారా గాని హాజరగుటకు బద్ధులై యుండవలెను మరియు తాను ఏ విషయమును గూర్చి పరీక్షించబడుచుండునో ఆ విషయమును గూర్చి నిజము చెప్పుటకు లేక కోరబడునట్టి కథనములు చేయుటకు మరియు అట్టి దస్తావేజులను, ఇతర వస్తువులను దాఖలు చేయుటకు అట్లు సమను చేయబడిన వ్యక్తులందరు బద్ధులైయుండవలెను:

1908 లోని 5.

అయితే, సివిలు ప్రక్రియా స్మృతి, 1908 యొక్క 132వ మరియు 133వ పరిచ్ఛేదముల క్రింది మినహాయింపులు, ఈ పరిచ్ఛేదము క్రింద హాజరగుట కొరకైన అభ్యపేక్షలకు వర్తించవలెను.

1860 లోని 45.

(4) పైన చెప్పిన ప్రతియొక పరిశీలన, భారత శిక్షాస్మృతియొక్క 193వ మరియు 228వ పరిచ్ఛేదముల భావపరిధిలో న్యాయిక చర్యగా భావించబడవలెను.

ఎక్సైజు అధికారులకు తోడ్పడుటకై కోరబడిన అధికారులు.

11. కస్టమ్స్ మరియు సెంట్రల్ ఎక్సైజు అధికారులందరు మరియు ఈ విషయమున నిర్దిష్టపరచబడునట్టి కేంద్ర ప్రభుత్వము యొక్క ఇతర అధికారులు మరియు పోలీసు అధికారులందరు, మరియు భూమిశిస్తు వసూలుచేయు అధికారు లందరు ఈ చట్టమును అమలు జరుపుటలో ఎక్సైజు అధికారులకు తోడ్పడుటకు ఇందుమూలముగ అధికారమొసగబడినది మరియు వారిని అట్లు కోరడమైనది.

12. ప్రతియొక భూమి సొంతదారు లేక ఆక్రమణదారు మరియు ఆ భూమి నిర్వహణ బాధ్యతకలిగియున్న అట్టి ఎవరేని భూమి సొంతదారు యొక్క లేక ఆక్రమణదారు యొక్క ఏజెంటు, ఈ చట్టపు నిబంధనలను లేక ఈ చట్టము క్రింద చేయబడిన నియమములను ఉల్లంఘించుచు ఆ భూమిపై సుంకము వర్తింపదగు సరుకులు వినిర్మాణము చేయబడుచున్నచో, ఆ సంగతి తనకు తెలియవచ్చిన వెంటనే యుక్తమైన కారణము లేనపుడు అట్టి వినిర్మాణమును గూర్చి మెజిస్ట్రేటుకు లేక ఎక్సైజు, కస్టమ్స్, పోలీసు లేక భూమిశిస్తు విభాగపు అధికారికి తెలియ పరచుటకు బద్ధుడైయుండును. భూమి సొంతదారులు లేక ఆక్రమణదారులు నిషిద్ధ సుంకము వర్తింపదగు సరుకుల వినిర్మాణమును రిపోర్టు చేయవలసియుండుట.

13. ఎవరేని భూమి సొంతదారు లేక ఆక్రమణదారు లేక ఆ భూమి నిర్వహణ బాధ్యతకలిగియున్న అట్టి భూమి సొంతదారు యొక్క లేక ఆక్రమణదారు యొక్క ఎవరేని ఏజెంటు ఈ చట్టపు నిబంధనలకు లేక ఈ చట్టము క్రింద చేయబడిన నియమములకు విరుద్ధమైన ఏదైన అపరాధముపట్ల బుద్ధిపూర్వకముగా మౌనానుకూలత చూపినచో, అతడు అట్టి ప్రతి అపరాధమునకై ఆరు మాసములదాక ఉండగల కారావాసముతోను లేక అయిదు వందల రూపాయలదాక ఉండగల జుర్మానాతోను లేక ఈ రెండింటితోను శిక్షింపబడదగియుండును. అపరాధముల పట్ల మౌనానుకూలత చూపినందులకు శిక్ష.

14. ఈ చట్టము క్రింద లేక ఈ చట్టము క్రింద చేయబడిన నియమముల క్రింద చేయబడిన అన్ని అరెస్టులు మరియు సోదాలు, క్రిమినలు ప్రక్రియా స్మృతి, 1898 క్రింద క్రమముగా సోదాలకు మరియు అరెస్టులకు సంబంధించి యున్నట్టి నిబంధనల ననుసరించి జరుపబడవలెను. సోదాలు మరియు అరెస్టులు చేయవలసిన పద్ధతి. 1898 లోని 5.

15. (1) ఈ చట్టము క్రింద అరెస్టు చేయబడిన ప్రతి వ్యక్తి, అట్లు అరెస్టు చేయబడిన వ్యక్తులను మెజిస్ట్రేటు వద్దకు పంపుటకు అధికారము పొందిన అత్యంత సమీపమునగల ఎక్సైజు అధికారివద్దకు, లేక యుక్తమైన దూరములో అట్టి ఎక్సైజు అధికారెవరునులేనిచో అత్యంత సమీపమునగల పోలీసు స్టేషను బాధ్యతగల అధికారివద్దకు జాప్యములేకుండ పంపవలెను. అరెస్టు చేయబడిన వ్యక్తులను పంపు రీతి.

(2) ఉపపరిచ్ఛేదము (1) క్రింద తన వద్దకు ఏ వ్యక్తియైనను పంపబడినట్టి పోలీసు స్టేషను బాధ్యతగల అధికారి, అతడు అధికారిత కలిగియున్న మెజిస్ట్రేటు సమక్షమున హాజరగుటకు అతని నుండి జామీను తీసికొనవలెను లేదా అతడు జామీను ఈయనియెడల, జాప్యము చేయకుండ అతనిని అట్టి మెజిస్ట్రేటు వద్దకు అభిరక్షలో పంపవలెను.

16. (1) అట్లు అరెస్టు చేయబడిన వ్యక్తులను మెజిస్ట్రేటు వద్దకు పంపుటకు అధికారము పొందిన ఎక్సైజు అధికారి వద్దకు ఎవరేని వ్యక్తి 15వ పరిచ్ఛేదము క్రింద పంపబడినపుడు, ఆ ఎక్సైజు అధికారి, అతనిపైగల ఆరోపణను పరిశీలన జరుపుటకు ఉపక్రమించవలెను. అరెస్టుచేసి తమ వద్దకు పంపబడిన వ్యక్తులనెక్సైజు అధికారులు పరిశీలన జరుపు పద్ధతి 1898 లోని 5.

(2) పోలీసు స్టేషను బాధ్యతగల అధికారి సంజ్ఞేయమైన కేసును దర్యాప్తు చేయుచున్నపుడు క్రిమినలు ప్రక్రియా స్మృతి, 1898 క్రింద ఏ అధికారములను వినియోగించవచ్చునో మరియు ఏ నిబంధనలకులోబడి యుండునో, ఉపపరిచ్ఛేదము (1) యొక్క ప్రయోజనము కొరకు ఎక్సైజు అధికారి అవే అధికారములను వినియోగించవచ్చును మరియు అవే నిబంధనలకు లోబడియుండవలెను:

అయితే, --

(ఎ) నిందితునిపై దాఖలనంత సాక్ష్యమున్నదని లేక అనుమానించుటకు యుక్తమైన ఆధారమున్నదని ఎక్సైజు అధికారి అభిప్రాయపడినచో అతడు, ఆ కేసులో అధికారిత కలిగియున్న మెజిస్ట్రేటు సమక్షమున హాజరగుటకు అతని నుండి జామీను తీసికొనవలెను లేదా జాప్యము చేయకుండ అతనిని మెజిస్ట్రేటు వద్దకు అభిరక్షతో పంపవలెను;

(బి) నిందితునిపై దాఖలనంత సాక్ష్యములేదని లేక అనుమానించుటకు యుక్తమైన ఆధారములేదని ఎక్సైజు అధికారికి తోచినచో, ఆ నిందితుడగు వ్యక్తి కోరినచో మరియు కోరినపుడు అధికారితగల మెజిస్ట్రేటు సమక్షమున హాజరగుటకు ఎక్సైజు అధికారి ఆదేశించునట్లు జామీనుదారులతో గాని జామీనుదారు లేకుండగాని బాండును నిష్పాదించి ఇచ్చిన మీదట అతనిని విడుదల చేయవలెను; మరియు ఆ కేసు వివరములన్నింటిని గూర్చి అతని పైఅధికారికి పూర్తిగా నివేదించవలెను.

(3) 15వ పరిచ్ఛేదము క్రిందగాని ఈ పరిచ్ఛేదము క్రింద గాని ఏవేని అధికారములను వినియోగించు అధికారులందరు తమ అధికారములను, అరెస్టుచేసిన స్థలము నుండి మెజిస్ట్రేటు న్యాయస్థానమునకు చేరుటకై ఆవశ్యకమైన కాలమును మినహాయించి అరెస్టు చేసినప్పటి నుండి ఇరువది నాలుగు గంటల కాలావధిలోపల, అరెస్టుచేయబడి నిరోధింపబడిన ప్రతియొక వ్యక్తి అత్యంత సమీపమునగల మెజిస్ట్రేటు సమక్షమున తప్పనిసరిగా హాజరుపరచబడునట్లు వినియోగించవలెను.

ఎక్సైజు అధికారిచే వేసరించుట కైన సోదా మరియు అభిగ్రహణ మొదలైనవి.

17. (1) ఈ చట్టము క్రింద గాని ఈ చట్టము క్రింద చేయబడిన నియమముల క్రింద గాని అధికారములను వినియోగించుచున్న ఎవరేని అధికారి--

(ఎ) ఏదైన స్థలమును, ప్రయాణ సాధనమును లేక జలయానమును అనుమానించుటకు యుక్తమైన ఆధారములేకుండ సోదాచేయుచో లేక సోదా చేయించుచో;

(బి) ఏ వ్యక్తినైనను వేసరించుటకై లేక అనావశ్యకముగా నిరోధించుచో, సోదాచేయుచో లేక అరెస్టుచేయుచో;

(సి) ఈ చట్టము క్రింద అధిహరణము చేయదగిన ఏదైన వస్తువును అభిగ్రహించు నెపముతో లేక సోదాచేయు నెపముతో ఎవరేని వ్యక్తియొక్క చరాస్తిని వేసరించుటకై లేక అనావశ్యకముగా అభిగ్రహించుచో;

(డి) ఏదైన ఇతర కార్యమును అట్టి కార్యము తన కర్తవ్య నిర్వహణ కవసరమైనదని విశ్వసించుటకు కారణము లేకుండ ఏ వ్యక్తికైనను హానికలుగునట్లు అట్టి అధికారి హోదాలో చేయుచో,

ఆ అధికారి అట్టి ప్రతియొక అపరాధమునకు రెండువేల రూపాయలదాకా ఉండగల జుర్మానాతో శిక్షింపదగియుండును.

(2) ఏ వ్యక్తియైనను బుద్ధిపూర్వకముగాను ద్వేషపూర్వకముగాను తప్పుడు సమాచారమునందజేసి ఈ చట్టము క్రింద ఏదైన అరెస్టు లేక సోదా జరుగునట్లు చేయుచో, అతడు రెండు సంవత్సరముల దాకా ఉండగల కారావాసముతోను, లేక రెండు వేల రూపాయలదాకా ఉండగల జుర్మానాతోను లేక ఈ రెండింటితోను శిక్షింపదగియుండును.

18. ఎవరేని ఎక్సైజు అధికారి, తన పై అధికారి యొక్క లిఖిత పూర్వక అభివ్యక్తమైన అనుమతిని పొందియుండిననే తప్ప, లేక తన ఉద్దేశమును గూర్చి లిఖితపూర్వకముగ రెండు మాసముల నోటీసు అట్టి పైఅధికారికి ఇచ్చి యుండిననే తప్ప లేక ఇతర శాసనసమ్మతమైన కారణముండియున్ననే తప్ప, తన పదవీ కర్తవ్యములను నిర్వర్తించకుండినచో లేక నిరాకరించుచో లేక అట్టి కర్తవ్యముల నుండి ఉపసంహరించుకొనినచో అతడు, మూడు మాసములదాకా ఉండగల కారావాసముతోగాని, మూడు మాసముల జీతముదాక ఉండగల జుర్మానాతో గాని లేక ఈ రెండింటితోగాని శిక్షింపబడదగియుండును.

కర్తవ్య నిర్వహణలో ఎక్సైజు అధికారుల విఫలత.

## అనుపూరక నిబంధనలు

19. (1) కేంద్ర ప్రభుత్వము, ఈ చట్ట ప్రయోజనములను నెరవేర్చుటకు రాజపత్రములో అధిసూచన ద్వారా నియమములు చేయవచ్చును.

నియమములు చేయు అధికారము.

(2) ప్రత్యేకించి మరియు పైన తెల్పిన అధికారము యొక్క వ్యాపకతకు భంగము వాటిల్లకుండ అట్టి నియమములలో--

(i) ఈ చట్టము క్రింద విధించబడిన సుంకముల నిర్ధారణ మరియు వసూలు, ఈ చట్టము క్రింది కృత్యములను నిర్వహించవలసిన ప్రాధికారులు, చెల్లింపును కోరుచు నోటీసులు జారీచేయుట, సుంకములు చెల్లింపబడదగు రీతి మరియు చెల్లింపబడని సుంకమును వసూలుచేయుట, వీటన్నిటి కొరకు నిబంధనలు చేయవచ్చును;

(ii) నిర్దిష్ట ప్రయోజనమునకై ఆమోదించబడిన భూమిపై లేక ఆవరణలలో తప్ప, సుంకము చెల్లింపదగు సరుకుల లేక వాటి సంఘటకముల లేక మిశ్రభాగముల లేక ఆధారపాత్రల వినిర్మాణమును లేక వినిర్మాణములోని ఏదైన ప్రక్రియను సంపూర్ణముగాగాని లేక కేంద్ర ప్రభుత్వము సబబని తలచునట్టి మినహాయింపులతో లేక అట్టి షరతులకులోబడి గాని నిషేధించవచ్చును;

(iii) నిలువచేయబడిన లేక వినిర్మాణము చేయబడిన లేక ఏదైన ఉత్పాదన లేక వినిర్మాణములోని ఏదేని ప్రక్రియకు లోనుచేయబడిన స్థలము నుండి సుంకము చెల్లింపదగు సరుకుల తరలింపును మరియు లైసెన్సుపొందిన వ్యక్తియొక్క లేక బాండు గిడ్డంగియొక్క ఆవరణలకు లేక ఆచటి నుండి లేక మార్కెటుకు ఆ సరుకుల రవాణా క్రమబద్ధము చేయవచ్చును;

(iv) ఈ చట్టము క్రింద విధించబడిన సుంకముల యొక్క సక్రమమైన విధింపు మరియు వసూలుకొరకు క్రమబద్ధీకరణ ఆవశ్యకమగునంతమేరకు, సుంకము చెల్లింపదగు సరుకుల లేక వాటి సంఘటకముల లేక మిశ్రభాగముల లేక ఆధారపాత్రల ఉత్పాదనను లేక వినిర్మాణమును లేక ఉత్పాదనలోని, లేక వినిర్మాణములోని ఏదైన ప్రక్రియను క్రమబద్ధము చేయవచ్చును.

(v) ఈ చట్టము క్రింద చేయబడిన ఏదైన నియమములను అమలు పరచుటను పర్యవేక్షించుటకై ఎక్సైజు అధికారుల నియామకము కొరకు నిబంధన చేయవచ్చును;

(vi) ఈ చట్టము క్రింద చేయబడిన నియమములను అమలుపరచుటను పర్యవేక్షించుటకై నియమింపబడిన ఎక్సైజు అధికారుల కొరకు వినిర్మాతకు

లేక లైసెన్సుదారుకు చెందిన ఫ్యాక్టరీ లేక గిడ్డంగియొక్క ప్రాంగణములలోపల వసతి సమకూర్చవలసినదని వినిర్మాతను లేక లైసెన్సుదారును కోరవచ్చును;

(vii) బాండు గిడ్డంగుల నియామకము కొరకు, లైసెన్సు ఇచ్చుటకు మేనేజిమెంటు మరియు పర్యవేక్షణచేయుట కొరకును, సుంకము చెల్లింప దగు సరుకులను అట్టి బాండు గిడ్డంగులలోవేయుటకు మరియు తీయుటకు లేక ఒక బాండు గిడ్డంగి నుండి మరొకదానికి తరలించుటకు అనుసరించబడవలసిన ప్రక్రియ కొరకును నిబంధనలు చేయువచ్చును;

(viii)లైసెన్సు క్రింద వినిర్మాణము చేయబడిన సుంకము చెల్లింప దగు సరుకులకును లైసెన్సు క్రింద దిగుమతి చేయబడిన సరుకులకును మరియు ఈ చట్టము క్రింద సుంకము చెల్లించబడిన లేక సుంకము నుండి మినహాయించబడిన సరుకులకును మధ్యగల వ్యత్యాసమును చూపుటకు నిబంధనలు చేయవచ్చును;

(ix) (తన సొంత బాబతునగాని బ్రోకర్లుగా లేక కమీషను ఏజెంట్లుగాగాని) వినిర్మాణము, నిలువ లేక విక్రయముచేయు వ్యక్తులపై, సమాచారమునందజేయు, రికార్డులు ఉంచు, *వివరణలు ఇచ్చు కర్తవ్యమును మోపుట ఈ చట్టము క్రింద విధించబడిన సుంకముల సక్రమ విధింపు మరియు వసూలుకొరకు ఆవశ్యకమగునంతమేరకు అట్టి కర్తవ్యమును ఆ వ్యక్తులపై మోప వచ్చును, మరియు అట్టి సమాచార స్వభావమును, అట్టి రికార్డులు మరియు *వివరణల ప్రరూపమును, అందు చేర్చబడవలసిన వివరములను వాటిని సత్యాపన చేయవలసిన రీతిని విహితపరచవచ్చును;

(x) సుంకము విధించదగు సరుకులు విహితపరచబడునట్టి స్వరూపపు బ్యాండెరోల్, స్టాంపు లేక లేబిల్ విహితపరచబడునట్టి రీతిగా అతికించబడినట్టి విహిత ఆధారపాత్రలలో తప్ప విక్రయించబడరాదని లేక విక్రయింపజూపబడరాదని లేక విక్రయమునకై పెట్టరాదని కోరవచ్చును.

(xi) లైసెన్సులు మరియు రవాణా పర్మిట్లను జారీచేయుట కొరకును, వాటికై ఏదైన ఫీజు విధించవలసియున్నచో అట్టి ఫీజు కొరకును, నిబంధనలు చేయవచ్చును;

(xii) సుంకమును రాబట్టుకొనుటకై సుంకము చెల్లింపదగు సరుకు లను, ప్లాంటు, యంత్రములను (మెషినరీని) లేక సామగ్రిని నిరోధించుటకు నిబంధనలు చేయవచ్చును;

(xiii) ఏ సుంకము చెల్లింపదగు ఏ సరుకుల విషయమున ఈ చట్టము క్రింద చేయబడిన ఏదైన నియమమును ఉల్లంఘించుట జరిగినదో ఆ సుంకము చెల్లింపదగు సరుకుల అధిహరణకు మరియు వేటి ద్వారా ఆ ఉల్లంఘన జరిగినదో అట్టి ఏదైన ఆల్కహాలు, ఓషధులు లేక సామగ్రి యొక్కయు, అట్టి సరుకులు లేక వస్తువులు ఉంచబడినట్టి ఏవైన పేటికలు, బంగీలు లేక కవరింగులు మరియు అట్టి సరుకులను లేక వస్తువులను కొనిపోవుటకై ఉపయోగించబడిన జంతువులు, వాహనములు, జలయానములు, లేక ఇతర ప్రయాణ సాధనములు మరియు అట్టి సరుకుల వినిర్మాణములో ఉపయోగించబడిన పరికరములు లేక మిషనరీ/యంత్రముల యొక్కయు అధిహరణకు నిబంధనలు చేయవచ్చును.

---

*రిటర్నులు

(xiv) ఈ చట్టము క్రింద చేయబడిన ఏదైన నియమమును ఉల్లంఘించినందులకు, రెండు వేల రూపాయలకు మించకుండ శాస్తి విధించుటకు నిబంధనలు చేయవచ్చును;

(xv) అట్టి అధిహరణ చేయుటకు, అట్టి శాస్తి విధించుటకు సంబంధించిన ప్రక్రియ ఏ ప్రత్యేక తరగతుల ఎక్సైజు అధికారులు అట్టి అధిహరణ లేక శాస్తిని గూర్చి న్యాయనిర్ణయము ఎంతవరకు చేయవచ్చునో అట్టి గరిష్ఠ పరిమితులు, అట్టి అధికారుల ఉత్తరువులపై అపీళ్లు, ఉన్నత ప్రాధికారిచే అట్టి ఉత్తరువుల పునరీక్షణ, అట్టి అప్పీళ్లు మరియు పునరీక్షణలకు కాలపరిమితి మరియు అధిహరణ చేయబడిన సరుకులను మరియు వస్తువులను వ్యయనము చేయుట కొరకు నిబంధనలు చేయవచ్చును;

(xvi) ఈ చట్టమునకుగాని, ఈ చట్టము క్రింద చేయబడిన నియమములకుగాని, విరుద్ధమైన అపరాధముల యొక్కయు లేక ఈ చట్టము క్రింద గాని ఈ చట్టము క్రింద చేయబడిన నియమముల క్రింద గాని ఉపగతమైన దాయిత్వముల యొక్కయు రాజీకి ప్రాధికారమొసగుచు క్రమబద్ధము చేయవచ్చును;

(xvii) ఫ్యాక్టరీల తనిఖీకొరకు ప్రాధికారమొసగి క్రమబద్ధము చేయవచ్చును మరియు అందు ఉత్పత్తి చేయబడిన ఏదైన పదార్థపు మచ్చులను తీసికొనుటకు లేక వాటిని పరీక్షచేయుటకు మరియు సుంకము చెల్లింపదగు సరుకుల ఉత్పాదన, నిలువ, విక్రయము లేక రవాణాకొరకు ఉపయోగించబడెడి ఏదైన స్థలము, రవాణా సాధనము లేక జలయానమును తనిఖీ లేక సోదా చేయుటకు ఈ చట్టము క్రింద విధింపబడిన సుంకముల సక్రమమైన విధింపు మరియు వసూలుకొరకు అట్టి తనిఖీ లేక సోదా ఆవశ్యకమగునంతమేరకు నిబంధనలు చేయవచ్చును;

(xviii) భారతదేశము వెలుపలకు ఎగుమతి చేయబడిన, లేక భారత దేశము వెలుపలనున్న ఏదైన ఓడరేవుకు జలమార్గమున వినియోగించుట కొరకు ఓడమీద పంపబడినట్టి సుంకము చెల్లింపదగు సరుకులపై చెల్లించబడిన సుంకము రిబేటు ఇచ్చుటకు నిబంధనలు చేయవచ్చును;

(xix) ఈ చట్టము క్రింద విధించబడిన మొత్తము సుంకము నుండి లేక అందలి ఏదైన భాగము నుండి సుంకము చెల్లింపదగు ఏదైన సరుకులను మినహాయించుట, వ్యాపారహితము దృష్ట్యాగాని ప్రజాహితము దృష్ట్యాగాని ఆవశ్యకమని కేంద్ర ప్రభుత్వము అభిప్రాయపడినచో, అట్టి మినహాయింపు ఈయవచ్చును;

(xx) అనుసూచిలోని ఏదైన ప్రత్యేక పద్దు క్రింద పన్ను నిర్ధారణ చేయబడవలసియుండు లేక వినిర్మాణము, రవాణా లేక పంపిణీ క్రమబద్ధము చేయబడవలసియుండు తయారీల పేర్ల సూచీలను, వివరములను రాజపత్రములో అధిసూచించవచ్చును;

(xxi) కేంద్ర ప్రభుత్వముచే ఈ పరిచ్ఛేదము క్రింద చేయబడిన ఏదైన నియమము వలన ఉత్పన్నమగు అనుపూరక విషయములకై లిఖితపూర్వక అనుదేశముల ద్వారా నిబంధనలు చేయుటకు ప్రత్యేక తరగతుల ఎక్సైజు అధికారులకు ప్రాధికారమొసగవచ్చును.

(3) 7వ పరిచ్ఛేదము క్రింద కూడ అపరాధమగునట్టి ఈ చట్టము క్రింది ఏదైన నియమము యొక్క ఉల్లంఘన విషయమున ఏదైన అధిహారణ లేక శాస్తి న్యాయనిర్ణీతమైనయెడల, సంబంధిత వ్యక్తిపై ఆ పరిచ్ఛేదము క్రింద అభియోగము తేబడరాదు.

(4) ఈ పరిచ్ఛేదము క్రింద చేయబడిన ప్రతి నియమము అది చేయబడిన తరువాత వీలైనంత త్వరగ పార్లమెంటు అధివేశనములోనున్న సమయమున మొత్తము ముప్పది దినముల కాలావధివరకు దాని ప్రతియొక సదనము సమక్షమున ఉంచవలెను. అట్టి కాలావధి ఒకే అధివేశనములో గాని రెండు లేక అంతకు ఎక్కువ వెనువెంటనే వచ్చు అధివేశనములలో గాని చేరియుండవచ్చును, మరియు పైన చెప్పబడిన అధివేశనమునకు లేక వరుసగావచ్చు అధివేశనములకు వెనువెంటనే వచ్చు అధివేశనము ముగియుటకు పూర్వమే ఆ నియమములో ఏదేని మార్పుచేయుటకు ఉభయ సదనములు అంగీకరించినచో లేక ఆ నియమము చేయబడరాదని ఉభయ సదనములు అంగీకరించినచో అటుపిమ్మట ఆ నియమము అట్లు మార్పు చేయబడిన రూపములో మాత్రమే ప్రభావము కలిగియుండును లేక సందర్భానుసారముగ, ప్రభావరహితమైయుండును. అయినప్పటికిని, ఆ నియమమునందలి ఏదేని అట్టి మార్పుగాని, ఆ నియమపు రద్దుగాని అంతకుపూర్వము ఆ నియమము క్రింద చేయబడిన దేని యొక్క శాసనమాన్యతకైనను భంగము కలిగించదు.

దావాలకు అడ్డంకి, మరియు దావాలకు, ఇతర శాసనిక చర్యలకు కాలపరిమితి.

20. (1) ఈ చట్టము క్రింద సద్భావపూర్వకముగ ఇవ్వబడిన ఏదైన ఉత్తరువును గూర్చి లేక సద్భావపూర్వకముగ చేయబడిన లేక చేయబడవలెనని ఆదేశించబడిన ఏదైన కార్యమును గూర్చి వసూలుచేయు ప్రభుత్వముపైగాని ఏ అధికారిపైగాని ఏ దావాయైనను లేక ఇతర శాసనిక చర్యయైనను ఉండదు.

(2) ఈ చట్టము క్రింద చేయబడిన లేక చేయబడవలెనని ఆదేశించబడిన దేనిని గూర్చియైనను వసూలుచేయు ప్రభుత్వముపైగాని ఎవరేని ఎక్సైజు అధికారిపైగాని వ్యాజ్య కారణము ఏర్పడినప్పటి నుండి లేక ఫిర్యాదు చేయబడిన కార్యము లేక ఉత్తరువు యొక్క తేదీ నుండి ఆరుమాసములు గడచిన పిమ్మట, ఎట్టి దావా, అభియోగము లేక ఇతర శాసనిక చర్యతేబడరాదు.

రద్దులు మరియు వ్యావృత్తి.

21. ఈ చట్టము ప్రారంభమగుటకు అవ్యవహితపూర్వము ఏదైన రాజ్యములో ఈ చట్టమునకు సమానమైన ఏదైన శాసనము అమలులోనున్నచో, ఆ శాసనమును ఇందుమూలముగా రద్దు చేయడమైనది:

అయితే, ఇందుమూలముగ రద్దుచేయబడిన ఏదైన శాసనము క్రింద చేయబడిన నియమములు, జారీచేయబడిన అధిసూచనలు, మంజూరు చేయబడిన లైసెన్సులు లేక పర్మిట్లు, ఒసగబడిన అధికారములు అన్నియు, అవి ఈ చట్టమునకు అననుగుణముగా లేనంతవరకు, అవి ఈ చట్టము క్రింద లేక ఈ విషయమున ఇందుమూలముగ అధికారమొసగబడిన ప్రాధికారిచే, క్రమముగా, చేయబడియుండిన, జారీచేయబడియుండిన, మంజూరు చేయబడియుండిన లేక ఒసగబడియుండిన ఎట్లో అట్లే అమలు మరియు ప్రభావము కలిగియుండవలెను.

# అనుసూచి

(పరిచ్ఛేదము 3 చూడుము)

| పద్దు సంఖ్య | సుంకము విధించదగు సరుకుల వర్ణన | సుంకపు రేటు |
|---|---|---|
| | **ఔషధీయ తయారీలు** | |
| 1. | అలోపతిక్ ఔషధీయ తయారీలు:- | |
| | (i) మామూలు ఆల్కహోలిక్ పానీయములుగా వినియోగించదగని ఆల్కహాలు కలిగిన ఔషధీయ తయారీ-- | |
| | (ఎ) పేటెంటు లేక ప్రొప్రయిటరీ ఔషధములు. | విలువనుబట్టి ఇరువది శాతము లేక శుద్ధ ఆల్కహాలు పరిమాణపు లీటరు ఒక్కంటికి పది రూపాయలు - దీనిలో ఏది ఎక్కువో అది. |
| | (బి) ఇతరములు | శుద్ధ ఆల్కహాలు పరిమాణపు లీటరు ఒక్కంటికి పది రూపాయలు. |
| | (ii) మామూలు ఆల్కహోలిక్ పానీయములుగా వినియోగించదగిన ఆల్కహాలు కలిగిన ఔషధీయ తయారీ-- | |
| | (ఎ) చికిత్స పరిమాణములలో విదిత క్షిప్ర మిశ్రభాగములు కలిగిన ఔషధీయ తయారీ. | విలువనుబట్టి ఇరువది శాతము లేక శుద్ధ ఆల్కహాలు పరిమాణపు లీటరు ఒక్కంటికి ఇరువది రూపాయలు దీనిలో - ఏది ఎక్కువో అది. |
| | (బి) ఇతరములు | విలువనుబట్టి ఇరువది శాతము లేక శుద్ధ ఆల్కహాలు పరిమాణపు లీటరు ఒక్కంటికి ఎనుబది రూపాయలు - దీనిలో ఏది ఎక్కువో అది. |
| | (iii) ఆల్కహాలు కలిగియుండక మాదక ఓషధి లేక మాదక పదార్థము కలిగియున్న ఔషధీయ తయారీ. | విలువనుబట్టి ఇరువది శాతము. |
| 2. | ఆయుర్వేదము, యునాని లేక ఇతర దేశీయ వైద్య పద్ధతిలో ఔషధీయ తయారీలు-- | |
| | (i) మామూలు ఆల్కహోలిక్ పానీయముగా వినియోగించదగని దానంతట అదే ఉత్పత్తియైన ఆల్కహాలు కలిగియున్న ఔషధీయ తయారీ. | ఏమీలేదు. |

| (1) | (2) | (3) |
|---|---|---|
| | (ii) మామూలు ఆల్కహోలిక్ పానీయములుగా వినియోగించదగిన, దానంతట అదే ఉత్పత్తియైన ఆల్కహాలు కలిగియున్న ఔషధీయ తయారీ. | శుద్ధ ఆల్కహాలు పరిమాణపు లీటరు ఒక్కంటికి రెండు రూపాయల ఏబది పైసలు. |
| | (iii) బట్టీపట్టుట ద్వారా తయారు చేయబడినట్టి లేక ఆల్కహాలు కలుపబడినట్టి ఆల్కహాలు కలిగియున్న ఇతరములన్నియు. | శుద్ధ ఆల్కహాలు పరిమాణపు లీటరు ఒక్కంటికి ఎనుబది రూపాయలు. |
| | (iv) ఆల్కహాలు కలిగియుండక మాదక ఓషధి లేక మాదక పదార్థము కలిగియున్న ఔషధీయ తయారీ. | విలువనుబట్టి ఇరువది శాతము. |
| 3. | ఆల్కహాలు కలిగియున్న హోమియోపతిక్ తయారీలు. | శుద్ధ ఆల్కహాలు పరిమాణపు లీటరు ఒక్కంటికి ఇరువది రూపాయలు. |
| | **ప్రసాధన ద్రవ్యముల తయారీలు** | |
| 4. | ఆల్కహాలు లేక మాదక ఓషధి, లేక మాదక పదార్థము కలిగియున్న ద్రవ్యముల తయారీ. | విలువనుబట్టి వంద శాతము లేక శుద్ధ ఆల్కహాలు పరిమాణపు లీటరు ఒక్కంటికి ఇరువది రూపాయలు – దీనిలో ఏది ఎక్కువో అది. |

<u>విశదీకరణ 1</u>:– "పేటెంటు లేక ప్రొప్రయిటరీ ఔషధములు" అనగా ఏదైన ఫార్మాకోపియా ఫార్ములరీ లేక కేంద్ర ప్రభుత్వముచే రాజపత్రములో ఈ విషయమున అధిసూచింపబడిన ఇతర ప్రచురణలో ఏదైన మోనోగ్రాఫుతో వినిర్దిష్టపరచబడని
1958 లోని 43. ఏదైన పేరును, లేక వ్యాపార మరియు వాణిజ్య చిహ్నముల చట్టము, 1958 క్రింద గల పేరును, లేక రిజిస్ట్రీకృత వ్యాపార చిహ్నమును లేక ఒక ప్రతీక (సింబల్) మోనోగ్రామ్, లేబిల్, సంతకము లేక ఇతర నవకల్పిత పదములవంటి ఏదైన ఇతర చిహ్నమును లేక ఆ ఔషధీయ తయారీ సంబంధమున, ఆ తయారీకిని మరియు ప్రొప్రయిటరుగాగాని అన్యథాగాని ఆ చిహ్నమును ఉపయోగించుటకు హక్కు కలిగియున్న ఎవరేని వ్యక్తికిని మధ్య వ్యాపార సరళిలో ఏదైన సంబంధమును, ఆ వ్యక్తిని ఆనవాలుపట్టు సూచనతోగాని అట్టి సూచన లేకుండగాని, తెలుపు ప్రయోజనమునకై లేక అట్లు సూచించుటకు గాని ఉపయోగించబడెడి ఏదైన వ్రాత అయినట్టి బ్రాండు పేరును ఆ ఔషధీయ తయారీపైన లేక దాని ఆధారపాత్రపైన లేక రెండింటిపైన కలిగియుండు ఏదైన ఔషధీయ తయారీ అని అర్థము.

<u>విశదీకరణ 2</u>:– ఏదైన వస్తువుపై ఆ వస్తువు యొక్క విలువనుబట్టి ఒక రేటు చొప్పున సుంకము విధించదగియున్నయెడల అట్టి విలువ, కేంద్ర ఎక్సైజుల
1944 లోని 1. మరియు ఉప్పు చట్టము, 1944 యొక్క 4వ పరిచ్ఛేదపు నిబంధనల ననుసరించి నిర్ధారణ చేయబడినట్టి విలువగా భావించబడవలెను.

<u>విశదీకరణ 3</u>:– ఈ అనుసూచి ప్రయోజనముల కొరకు తయారీ విషయమున "శుద్ధ ఆల్కహాలు పరిమాణము" అనగా 15° సెంటిగ్రేడు వద్ద 100 శాతం ఘన పరిమాణపు ఆల్కహాలుగా చెప్పబడి తయారీలోనున్న ఈథైల్ ఆల్కహాలు పరిమాణము అని అర్థము.

*****